క్లుప్తంగా

చర్మకారులకు పింఛన్ మంజూరు చేయాలి

ఏలూరు (టూటౌన్): డప్పు కళాకారులు, చెప్పులు కుట్టే కార్మికుల్లో అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయాలని ఏపీ రాష్ట్ర బహుజన సేన సమితి రాష్ట్ర అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ఆర్ఆర్‌పేటలోని సంఘ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చర్మకారులకు హెల్త్ కార్డులు, రుణాలు, యూనిట్లు మంజూరు చేయాలని కోరారు. పలువురు బీఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం అందించండి



విద్యార్థుల భోజనాలను పరిశీలిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజేశ్వరి

ఏలూరు (టూటౌన్): బాలలకు నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి సూచించారు. స్థానిక శనివారపుపేట బాలుర వసతి గృహాన్ని శనివారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. వీలైనంత వరకూ సన్న రకం బియ్యం ఉపయోగించాలని, పోషక ఆహారాన్ని అందించాలని, సమస్య వస్తే తమ సంస్థ దృష్టికి తీసుకురావాలని సూచించారు. బాలురకు అందించే అన్నం, కూర, చారు తదితర ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో వసతి గృహం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అభిషేకాలు



శ్రీరామునికి అభిషేకం చేస్తున్న అర్చకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పునర్వసు నక్షత్రం పర్వదినం సందర్భంగా స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలోని రామమందిరంలో శ్రీరామునికి భక్తిశ్రద్ధలతో అభిషేకాలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన, అభిషేకాల అనంతరం విశేష అలంకరణ చేశారు. అర్చకులు తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వర శర్మ పూజలు చేయగా రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

చంద్రబాబు కంటే సైకో ఎవరున్నారు..

- వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని
- ఏలూరులో వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశం



గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

ఏలూరు టౌన్: అప్పులపాలు చేసి రాష్ట్రాన్ని దోచుకున్న ప్రతిపక్షనేత చంద్రబాబు కంటే సైకో ఎవరున్నారని వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని ప్రశ్నించారు. శనివారం స్థానిక శనివారపుపేట రోడ్డులోని సారధి కల్యాణ మండపంలో ఏలూరు నియోజకవర్గం జోన్ 2 పరిధిలోని జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్ల ఆత్మీయ సమావేశం పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ చంద్రబాబు ప్రజలకు ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా అమలు చేయలేదని ఆరోపించారు. ప్రజలకు 32 లక్షల ఇళ్ల పట్టాలిచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలోపెట్టి పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తోన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని నారా లోకేష్ సైకో అంటున్నాడని.. ఇటీవల ప్రచార యావతో ఇరుకురోడ్లపై మీటింగులు పెట్టి 11 మంది మహిళల మరణానికి, గోదావరి పుష్కరాల్లో సినిమా సెట్టింగులు పెట్టి 29 మంది ప్రాణాలు బలితీసుకున్న చంద్రబాబే సైకో అని అన్నారు. గతంలో ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని నిలబెట్టుకోని, జనాల్ని రోడ్డున పడేసిన చంద్రబాబు సైకో కాదా అని ప్రశ్నించారు.

సైనికుల్లా పనిచేయండి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలు, ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. ప్రజల్లోకెళ్లి పార్టీని బలోపేతంతోపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఏలూరు నగరంలో 1495 క్లస్టర్లలో ప్రజల పరిస్థితిని తెలుసుకుంటూ సమస్యల పరిష్కారానికి సైనికుల్లా పనిచేయాలన్నారు.

ప్రభుత్వానికి మంచి పేరు తేవాలి

నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరి, నగర డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ ప్రభుత్వానికి ప్రతినిధుల్లా మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే నాని, నేతలు కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. సమావేశంలో ఏలూరు జోన్1 కన్వీనర్, కార్పొరేటర్ యర్రంశెట్టి సుమన్, జోన్2 కన్వీనర్, మాజీ కార్పొరేటర్ బండారు కిరణ్‌కుమార్, జోన్3 కన్వీనర్, కార్పొరేటర్ తుమరాడ స్రవంతి, పార్టీ సీనియర్ నాయకులు మధ్యాహ్నపు బలరాం, ఏఎంసీ వైస్ చైర్మన్ కంచన రామకృష్ణ, కార్పొరేటర్లు ఇనపనూరి కేదారేశ్వరి, నున్న స్వాతిశ్రీదేవి, జిజ్జువరపు విజయనిర్మల, తోట హేమమాధురి, విప్ పైడి భీమేశ్వరరావు తదితరులు ఉన్నారు.

విద్యార్థి కృష్ణకాంత్ ఆత్మహత్యపై దర్యాప్తు

ఏలూరు టౌన్: స్థానిక పెద్ద రైల్వేస్టేషన్ సమీపంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో డిగ్రీ విద్యార్థి కృష్ణకాంత్ ఆత్మహత్యపై టూటౌన్ సీఐ చంద్రశేఖర్ పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు. కృష్ణకాంత్‌కు తండ్రి లేడు. తల్లి కూలిపనులు చేస్తూ తమ ఇద్దరు బిడ్డలను పోషిస్తోంది. కృష్ణకాంత్ హాస్టల్‌లో ఉంటూ డిగ్రీ చదువుతుండగా, తమ్ముడు వేరే ఊరిలో హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులకు వెళ్లిన కృష్ణకాంత్ నాలుగు రోజుల క్రితమే హాస్టల్‌కు వచ్చాడు. కృష్ణకాంత్ ఇంటి వద్ద తన సెల్‌ఫోన్‌ను తల్లి సూచన మేరకు తమ్ముడికి ఇచ్చాడు. మరోఫోన్ కొనిస్తానని తల్లి కృష్ణకాంత్‌కు చెప్పింది. కృష్ణకాంత్‌కు చిన్న కీప్యాడ్ ఫోన్ ఇచ్చి పంపారు. ఆత్మహత్యకు పాల్పడిన రోజు ఉదయం తల్లి కృష్ణకాంత్‌కు ఫోన్ చేసి కొత్త ఫోన్ కొన్నాను, తీసుకువస్తానని చెప్పినట్లు చెబుతున్నారు. ఫోన్ కోసమైతే తల్లి కొత్త ఫోన్ కొన్నానని చెప్పిన తరువాత ఎలా ఆత్మహత్య చేసుకుంటాడనే కోణంలో విచారణ చేస్తున్నారు. తన కుమారుడు ప్రయోజకుడు అవుతాడని భావిస్తే ఇలా చేస్తాడని అనుకోలేదని తల్లి బోరున విలపించింది.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట







తెలికుల సంక్షేమ సంఘం, స్వర్ణకారుల సంఘం, కళింగుల సంఘం భవనాల నిర్మాణాలకు నిధుల మంజూరు పత్రాలను నాయకులకు అందజేస్తున్న ఎమ్మెల్యే నాని

ఏలూరు టౌన్: ఏలూరు నియోజకవర్గంలో అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తానని, ఏ విధమైన సహాయం కావాలన్నా తనను కలవాలని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. నగరంలోని పలు సామాజికవర్గాల సంక్షేమ భవనాలకు గతంలో ఉచితంగా స్థలాలను కేటాయించిన ఆయన తాజాగా ఆయా భవనాల నిర్మాణాలకు రూ.35 లక్షల నిధులను మంజూరు చేస్తూ అనుమతి పత్రాలను శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో వారికి అందజేశారు. ఏలూరు పట్టణ అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం నాయకులు, స్వర్ణకారుల సంఘం, కళింగుల సంక్షేమ సంఘం నాయకులు ఎమ్మెల్యే నానిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తెలికుల సంక్షేమ భవన నిర్మాణానికి రూ.10 లక్షలు, స్వర్ణకారుల సంక్షేమ సంఘ భవన నిర్మాణానికి రూ.10 లక్షలు, కళింగ సంక్షేమ సంఘ భవన నిర్మాణానికి రూ.15 లక్షల నిధులను నాని మంజూరు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇమ్మానియేల్ జయకర్, సుంకర చంద్రశేఖర్, యర్రంశెట్టి నాగబాబు, ఆయా సంక్షేమ సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

ఏలూరు టౌన్: ఏలూరు నగర అభివృద్ధి, సుందరీకరణ, పరిశుభ్రతకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల నాని చెప్పారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నానిని నగర నూతన కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికతో పనిచేయాలని నాని సూచించారు. పారిశుధ్య నిర్వహణ, ఆహ్లాదకరమైన వాతావరణానికి స్పెషల్ డ్రైవ్, నగరంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ప్లాస్టిక్ వస్తువుల నిషేధాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు ఉన్నారు.

ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్‌గా శ్రీదేవి

దెందులూరు: పోతునూరు ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్‌గా శ్రీదేవి బాధ్యతలు శనివారం స్వీకరించారు. పోతునూరులో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి, సకాలంలో పౌష్టికాహారం అందించేందుకు కృషి చేస్తామన్నారు.

పైడిచింతపాడులో హౌసింగ్ డే



పైడిచింతపాడులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జగనన్నకాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని తహసీల్దార్ బి.సోమశేఖర్ అన్నారు. శనివారం ఏలూరు మండలం పైడిచింతపాడులో సర్పంచ్ ముంగర తిమోతి అధ్యక్షతన హౌసింగ్ డే నిర్వహించారు. గ్రామంలో లబ్ధిదారులతో కాలనీ వద్ద సమావేశం నిర్వహించారు. సోమశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న కాలనీ వద్దకే ఇసుక, ఐరన్, సిమెంట్ అందిస్తోందన్నారు. రోడ్లు, విద్యుత్ కనెక్షన్ సైతం వేగవంతంగా ఏర్పాటుచేస్తోందని చెప్పారు. ఉచిత విద్యుత్ కనెక్షన్‌తోపాటు కుళాయి కనెక్షన్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పేదలు సొంతిల్లు కట్టుకునేందుకు ఆర్థిక సాయం చేస్తోందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు పల్లెం ప్రసాద్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సహకారంతో ప్రభుత్వ నిధులతో ఇళ్ల స్థలాలు మెరక చేశారని గుర్తుచేశారు. ఇంటి నిర్మాణానికి ప్రతి లబ్ధిదారుడుకీ రూ.2.15 లక్షలు అందిస్తుందన్నారు. ఎంపీడీఓ బి.ప్రణవి మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు గ్రూపుల నుంచి ఆర్థిక సాయం త్వరితగతి అందిస్తున్నట్టు చెప్పారు. ఇంటి నిర్మానం ప్రారంభించాలని లబ్ధిదారులకు సూచించారు. దీంతో మహిళలు త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఎంఎస్ఆర్ఈజీఎస్ ఏపీఓ కిషోర్, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నివారణలో భాగస్వామి కావాలి



క్యాన్సర్ అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ఫాదర్ ఇమ్మానియేల్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): క్యాన్సర్ నివారణలో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలని ఏలూరు సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ ఇమ్మానియేల్ పేర్కొన్నారు. జిల్లాలోని బువ్వనపల్లి గ్రామంలో ఏలూరు కథోలిక పీఠం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన క్యాన్సర్ అవగాహన ర్యాలీకి సంబంధించిన వివరాలను ఏలూరులో ఆయన విడుదల చేశారు. క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలని, తరచూ వైద్య పరీక్షలు చేయించుకుంటూ క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించడం ద్వారా వైద్య చికిత్సలు పొందితే వ్యాధి నుంచి బయటపడవచ్చని సూచించారు. బువ్వనపల్లిలోని ఇన్‌ఫెంట్ జీసస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌కు చెందిన సుమారు 500 మంది విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజల్లో అవగాహన కలిగించామన్నారు. స్కూల్ యాజమాన్య ప్రతినిధి సిస్టర్ ఆరోఖ్య కమల్, సిస్టర్ స్వర్ణలత, సిస్టర్ మేరీ ఎలిజబెత్ తదితరులు పాల్గొన్నారన్నారు.

కళారంగానికి చీకటి రోజులు



కళారత్న సత్యనారాయణ గృహంలో ముచ్చటిస్తున్న వాణీ జయరాం (ఫైల్)

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రస్తుతం కళారంగానికి చీకటి రోజులు నడుస్తున్నాయని నగరానికి చెందిన కళారత్న కేవీ సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. కళా తపస్వి కె.విశ్వనాథ్ మృతితో కుదేలైన కళారంగం వెంటనే మరో దిగ్గజ కళాకారిణి గాయని వాణీ జయరాం మృతి తీవ్రంగా కలిచివేసిందన్నారు. ఈ సందర్భంగా వాణీ జయరాంతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. శృతిలయలు చిత్రంలో ఆమె ఆలపించిన శ్రీగణనాథం గజాననం అనే గీతానికి నృత్య దర్శకత్వంతో తన సినీరంగ ప్రయాణం ప్రారంభమయిందని చెప్పారు. తన ఆహ్వానం మేరకు వాణీ జయరాం తన భర్తతో కలిసి ఏలూరు నగరంలోని తన నివాసానికి రావడంతో పాటు నగరంలో జరిగిన వేంగి ఉత్సవాల్లో ఆమె తన గాత్ర మాధుర్యాన్ని నగర ప్రజలు పంచారని గుర్తు చేసుకున్నారు. సినీ గీతాలాపనలో తనకంటూ ప్రత్యేక శైలిని, గుర్తింపుని తెచ్చుకున్న మహాగాయని వాణీ జయరాం మృతి తనకు వ్యక్తిగతంగా తీరని లోటని, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ఆమె కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

దాళ్వాలో మంచి దిగుబడులు సాధించాలి

దెందులూరు: వ్యవసాయశాఖ సలహాలు, సూచనలు పాటిస్తూ దాళ్వాసాగులో మంచి దిగుబడులు సాధించాలని వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గిరిజా కుమారి, లక్ష్మీ, భావన, రేవతి, ప్రమీల, జ్యోతిక అన్నారు. దెందులూరులో రైతు భరోసా కేంద్రంలో ఏఓ గద్దె రమేష్ ఆధ్వర్యంలో దాళ్వా వరి పంటలో కాండంతొలుచు పురుగును గమనించి వాటి నివారణా చర్యలను రైతులకు వివరించారు. రైతులు అనవసరంగా ముందస్తు స్ప్రేయింగ్స్ చేయరాదని, దీనివల్ల పెట్టుబడి అధికం అవుతుందని తెలిపారు. పైరు పై పురుగు, తెగులు ఉధృతి కనిపిస్తేనే మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ రామకృష్ణ, రమేష్, రైతులు ఉన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	12	చిక్కుడు కాయలు	30
వంకాయలు (కాంతులు)	20	చామదుంపలు	56
వంకాయలు (తెలుపు)	18	ములక్కాడలు	12-15
బెండకాయలు	52	కంద	40
పచ్చిమిర్చి	24	బీట్‌రూట్	34
కాకర కాయలు	30-34	కీరా దోస	44
బీరకాయలు	36	ఫ్రెంచ్‌బీన్స్	46
బీరకాయలు (పందిరి)	48	అల్లం	68
క్యాబేజీ	16	కొత్తిమీర (కట్ట)	13
క్యారెట్	32	పాలకూర	08
దొండకాయలు	24	చుక్కకూర	08
బంగాళదుంపలు	25	తోటకూర	08
ఉల్లిపాయలు	24	గోంగూర	08
గోరుచిక్కుడు	40	పుదీనా	07
దోసకాయలు	28-40	బఠాణి	--
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	56
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	24-30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	12
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	17
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	18
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	06
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	03
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	05
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	20
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	01
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.15	34820	06
ఏలూరు -బీహెచ్ఈఎల్	09.00	4794	31
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	33
ఏలూరు - తిరుపతి	16.00	4830	29



హేలాపురి బాలోత్సవంలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

బాలోత్సవ సందడి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్‌లో శనివారం ప్రారంభమైన హేలాపురి బాలోత్సవం మూడో పిల్లల సంబరాల్లో విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. జానపద నృత్యం, విచిత్ర వేషధారణ, కోలాటం, శాస్త్రీయ నృత్యం, దేశభక్తి గీతాలాపన, లఘు నాటిక, ఏకపాత్రాభినయం తదితర కల్చరల్ పోటీలు, క్విజ్, తెలుగులో మాట్లాడడం, కథ చెప్పడం, వక్తృత్వం, చిత్రలేఖనం తదితర అకడమిక్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 1000 మందికి పైగా విద్యార్థులు ఒకేసారి పాడుదమా స్వేచ్ఛా గీతం అనే దేశభక్తి గీతాన్ని పాడటంతో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదయ్యారు.



అల్లూరి సీతారామరాజు వేషధారి



ఝాన్సీలక్ష్మీబాయి వేషధారణలో చిన్నారి



ఆర్ఆర్ఆర్ కొమ్మా ఉయ్యాలా..

వైభవంగా నరసన్న గ్రామోత్సవం

ద్వారకాతిరుమల : శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన మండలంలోని ఐఎస్.జగన్నాధపురంలో సుందరగిరిపై మహిమాన్వితుడిగా విరాజిల్లుతోన్న శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలు కన్నులపండువగా జరుగుతున్నాయి. అందులో భాగంగా శనివారం ఆలయంలో విశేష కార్యక్రమాలు నిర్వహించారు. ఈనెల 1 న ప్రారంభమైన ఉత్సవాలు 6 తో ముగియనున్నాయి. వేడుకల్లో భాగంగా ఉదయం ఆలయ ఆవరణలో నిత్యహోమాలు, మూలమంత్ర హవనాలు, బలిహరణలు, వేదపారాయణలను ఆలయ అర్చకులు, పండితులు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం జగన్నాధపురం క్షేత్ర పురవీధుల్లో వైభవంగా జరిగింది. శ్రీదేవీ, భూదేవి సమేత నారసింహుడు తమ ఇంటి ముంగిటకు రావడంతో భక్తులు నీరాజనాలను సమర్పించి, భక్తి ప్రపత్తులను చాటారు. ఆలయ ఈఓ వేంద్ర త్రినాధరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పాలపొంగళ్ల నైవేద్యం

సుందరగిరిపై స్వామివారిని దర్శించుకున్న పలువురు మహిళా భక్తులు పాలపొంగళ్లను తయారుచేసి స్వామివారికి నైవేద్యంగా స్వయంగా సమర్పించారు. ఆ తరువాత వారంతా నవగ్రహ, తులసి పూజలను జరిపి, భక్తి విశ్వాసాలతో స్వామివారిని దర్శించుకున్నారు. ఏటా ఇలా పాలపొంగళ్లను స్వామివారికి నైవేద్యంగా సమర్పిస్తున్నట్లు పలువురు భక్తులు తెలిపారు.